ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 18 జూన్ 2025

డీఎస్సీకి 742 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి సంబంధించి మెగా డీఎస్సీ కొనసాగుతోంది. మంగళవారం జిల్లాలో రెండు కేంద్రాల్లో రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించిన పరీక్షకు 761 మంది అభ్యర్థులకుగానూ 742మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 561మంది అభ్యర్థులకుగానూ 547 మంది పరీక్ష రాశారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 200మంది అభ్యర్థులకుగానూ 195 మంది హాజరయ్యారు.

ప్రపంచానికే ఆదర్శంగా.. యోగా

- 21న విశాఖలో 5లక్షల మందితో గిన్నిస్ రికార్డు సాధన
- జిల్లా నుంచి 20వేల మందిని తరలించేలా ఏర్పాట్లు
- అదేరోజున జిల్లాలో 6,500 చోట్ల కార్యక్రమం
- అందరూ భాగస్వాములు కావాలి
- రాష్ట్రమంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రులు శ్రీనివాస్, అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగాలో ప్రపంచానికే ఆదర్శవంతంగా రాష్ట్రాన్ని నిలబెట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు మాట్లాడుతూ.. 'ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతారు. గిన్నిస్ రికార్డు సాధనలో భాగంగా 5లక్షల మంది యోగాసనాలు వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే గత నెల 21 నుంచి ఈ నెల 20వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం. జిల్లాలోని యోగాంధ్ర కార్యక్రమంలో ఇప్పటికే 9.50 లక్షల మంది రిజిస్ట్రేషన్ (మిగతా 6వ పేజీలో..)


అరసవల్లిలో యోగాసనాలు..

విశాఖకు 20 వేల మంది సాధకులు

- డీఆర్వో వేంకటేశ్వరరావు
- అరసవల్లిలో ఘనంగా యోగాంధ్ర

6లో


టెక్కలిలో నీలిరంగు గ్రానైట్ క్వారీ

త్వరలో కొత్త మైనింగ్ పాలసీ

- ఎదురుచూస్తున్న గ్రానైట్ వ్యాపారులు
- జిల్లాలో 200 పైగా లీజుల దరఖాస్తుల పెండింగ్

టెక్కలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన మైనింగ్ పరిశ్రమలో సమూలమార్పులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కొత్త మైనింగ్ విధానంపై త్వరలో జీవో విడుదల చేయనుంది. దీనికోసం పరిశ్రమలు, గ్రానైట్ క్వారీల యాజమనులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ పెద్దఎత్తున విస్తరించి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 200కు పైగా లీజుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పట్లో నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ పూర్తిస్థాయిలో వైసీపీ నేతల కనుసన్నల్లోనే నడిచేది. అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి అనుయాయులు సైతం గ్రానైట్ క్వారీలు నిర్వహిస్తూ దోచుకున్నారు. జిల్లాలోని టెక్కలి, శ్రీకాకుళం గనులశాఖ ఏడీ, డీడీ కార్యాలయాల్లో ఫైళ్లు వైసీపీ పెద్దల ఆదేశాలతోనే కదిలేవి. వైసీపీకి అనుకూలంగా ఉంటే చాలు. గనుల శాఖ అధికారుల ద్వారా వివరాలు తెలుసుకొని వారి పేరున క్వారీ లీజులు అడ్డగోలుగా మంజూరు చేసేవారు. అనుకూలంగా లేని వ్యక్తుల క్వారీ లీజుల దరఖాస్తులను ఆక్షన్ విధానానికి సిఫారసు చేసేవారు. లేదా క్వారీలు వేస్తూ లీజు ఫైలు పక్కన పడేసేవారు. 2019-24 మధ్య కాలంలో సారవకోట, మెళియాపుట్టి, పాతపట్నం, నందిగాం, టెక్కలి, పలాస, కంచిలి, మందస తదితర ప్రాంతాల నుంచి సుమారు 200కుపైగా క్వారీల లీజుల కోసం పంచాయతీ, రెవెన్యూ అన్ని రకాల ఎన్‌వోసీలు పొంది ఆఖరికి గనుల శాఖ ద్వారా కమిషనర్ కార్యాలయం వరకు లీజుల మంజూరు కోసం ఫైల్ వెళ్లేది. ఈ పరిస్థితుల్లో వైసీపీ పెద్దల దృష్టి పడి క్వారీ లీజులు ఎలా కబ్జా చేయాలో ఆయా మైన్స్ కార్యాలయాల పరిధిలోని బ్రోకర్లు ద్వారా గుర్తించేవారు. ఉదాహరణకు సారవకోట మండలం దంత సమీపంలో సర్వేనెం.46లో ఐదు హెక్టార్ల గ్రానైట్ లీజులు చిన్మయి గ్రానైట్ లీజులు కోరగా.. అడ్డగోలుగా ఆక్షన్ విధానం అమలు చేసేశారు. అదే వైసీపీ పెద్దలకు అనుకూలమైన పొన్నవోలు కార్తీకరెడ్డికి జిల్లాలో ఓ క్వారీ లీజులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేటాయించారు. చాలా మంది క్వారీ లీజుల దరఖాస్తులను గనులశాఖ కార్యాలయంలోని బ్రోకర్ల ద్వారా వైసీపీ నేతలు పెండింగ్‌లో ఉంచేశారు. ఈ విధానాలకు (మిగతా 6వ పేజీలో..)

- ఖరీఫ్‌లో సాగుకు రైతుల సన్నద్ధం
- 20 కేజీల విత్తనాలు రూ.1800
- దోచుకుంటున్న వ్యాపారులు

సన్నాలు వద్దు.. ముదుగులే ముద్దు



నరసన్నపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి):

ఖరీఫ్‌లో వరిసాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని చోట్ల విత్తనాలు వేస్తున్నారు. ఈసారి సన్నాలు కన్నా.. ముదుగు వరి విత్తనాలు సాగుకే అధిక శాతం రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఈఏడాది సుమారు 5లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. గతేడాది సాంబమసూరి, 1204 తదితర సన్నాలు సాగు చేశారు. ముదుకు రకాలు కన్నా సన్నరకాలు దిగుబడి తక్కువగా వస్తాయి. కానీ బయట మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. 80కేజీల ధాన్యం బస్తా రూ.2,200 వరకు మిల్లర్లు కొనుగోలు చేస్తారు. గతేడాది సుమారు 1.12 లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగు చేశారు. పంట చేతికి వచ్చిన తర్వాత బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు వీటిని కొనుగోలు చేయలేదు. ఖరీఫ్‌లో సాగుచేసిన సన్నరకం ధాన్యం.. ఆడించిన తర్వాత చాలా శాతం ముక్కగా మారిపోవడంతో వీటి కొనుగోలుకు ఆసక్తిచూపలేదు. దీంతో గత్యంతరం లేక 80కేజీల బస్తాను రూ.1,600కు రైతులు విక్రయించారు. ఈ పరిణామం దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది రైతులు ముదుకు రకాలైన అమూల్య, 333, సంధ్య, సంపద స్వర్ణ వంటి రకాలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయశాఖ కిలోకు రూ.10 సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నా.. చాలామంది రైతులు ముదుగురకాలైన వరి విత్తనాల కోసం ప్రైవేటు డీలర్లనే ఆశ్రయిస్తున్నారు. తెగుళ్ల ఆశించినా, అధిక దిగుబడి ఇచ్చే రకాలు అంటూ వ్యాపారులు ఈ విత్తనాలను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే విత్తనాలపై రైతులు మొగ్గు చూపకపోవడంతో ప్రైవేటు సీడ్స్‌కు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. తెలంగాణ, నూజివీడు తదితర ప్రాంతాల నుంచి తెప్పించిన రీచెర్స్ వెరైటీలు 333, అమూల్య, సంపద స్వర్ణ తదితర (మిగతా 6వ పేజీలో..)


భావనపాడు తీరం

పిక్నిక్ స్పాట్లు చూద్దామా?

- జిల్లాలో ఆకట్టుకుంటున్న ప్రదేశాలు
- భావనపాడు, డోకులపాడు, బారువ బీచ్‌లకు పెరుగుతున్న సందర్శకులు
- నేడు ప్రపంచ పిక్నిక్ దినోత్సవం

6లో

ఇరువర్గాల కొట్లాట

- 12మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

8లో

ఉపాధి ఉసురు తీసింది

- విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

8లో

షట్టర్లు ఇలా.. సాగునీరెలా?

- మరమ్మతులకు నోచుకోని వైనం
- శివారు ప్రాంత రైతులకు తప్పని ఇబ్బందులు

8లో

అల్లుడే కడతేర్చాడు

- క్షణికావేశంలో మామను హతమార్చిన వైనం
- మద్యానికి బానిసై.. తరచూ గొడవలు
- బైక్ విషయమై ఘర్షణపడి.. కత్తితో పొడిచి..


గంగయ్య (ఫైల్)

ఇచ్ఛాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటికి పెద్దకొడుకు మాదిరి అండగా నిలవాల్సిన అల్లుడు.. క్షణికావేశంలో మామను కడతేర్చాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో మామ-అల్లుడు మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. మంగళవారం బైక్ విషయమై ఆ ఇద్దరి మధ్య తలెత్తిన ఘర్షణ.. హత్యకు దారితీసింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలం మండపల్లికి చెందిన బర్రి గంగయ్య(59).. మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన పెద్దల్లుడు పాతిర్ల దశరథరెడ్డి అలియాస్ దాస్ చేతిలో హత్యకు గురయ్యాడు. కొద్దిరోజులుగా (మిగతా 6వ పేజీలో..)


వేంకటేశ్వరుడికి పుష్పయాగం



శ్రీకాకుళం కల్చరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం డీసీసీబీ కాలనీలోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పుష్పయాగం నిర్వహించారు. చామర్తి జగన్నాథచార్యులు ఆధ్వర్యంలో బంతి, చామంతి, గులాబీ, సన్నజాజి పూలతో అలంకరించారు. మేళతాళాలతో.. గరుడ వాహన సేవ నిర్వహించారు. సానావీధి, డీసీసీబీ కాలనీ, కొన్నావీధి ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు.

ఎట్టకేలకు మద్యం దుకాణం తరలింపు

ఇచ్ఛాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈదుపురంలో జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉన్న కంటైనర్ మద్యం దుకాణాన్ని ఎట్టకేలకు మంగళవారం తొలగించారు. పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుపై విద్యార్థులు, తల్లిదండ్రులు వారం రోజులుగా ఆందోళన చేశారు. మద్యం దుకాణం తొలగించకపోతే పాఠశాలకు పిల్లలను పంపించేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మద్యం దుకాణాన్ని తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు మద్యం దుకాణాన్ని మూసేసి.. బూర్జపాడు పంచాయతీ పరిధికి తరలించారు. అక్కడ ఖాళీ స్థలం కోసం సేకరణ చేస్తున్నారు. మద్యం దుకాణం తొలగింపుపై సర్పంచ్ నర్తు ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్, పాఠశాల హెచ్‌ఎం, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


మూతపడిన కంటైనర్ మద్యం దుకాణం

పిక్నిక్ స్పాట్లు చూద్దామా

- జిల్లాలో ఆకట్టుకుంటున్న ప్రదేశాలు
- ఏటా వేలల్లో సందర్శకుల రాక


సోంపేట: బారువ బీచ్‌లో సందర్శకుల సందడి

నేడు ప్రపంచ పిక్నిక్ దినోత్సవం

పిక్నిక్..
ఈ పదం వింటే సరదా పడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఐక్యతకు... స్నేహభావానికి... చిహ్నంగా భావించే పిక్నిక్‌లతో కలిగే ఆనందాన్ని వెలకట్టలేం. ఏటా పిక్నిక్ సీజన్‌లో జిల్లాలోని పర్యాటక కేంద్రాలు ఏ స్థాయిలో సందడిగా ఉంటాయో మనకు తెలిసిందే. అంతేకాదు.. వచ్చే ఏడాది ఎక్కడికి వెళ్లాలో ఈ సంవత్సరమే నిర్ణయించి.. ప్రణాళికలు అమలు చేసేది ఎందరో. వీరి సరదాలకు తగినట్లే పిక్నిక్ స్పాట్లూ ఊరిస్తుంటాయి. దీంతో వేలాది మంది ఈ కేంద్రాల్లో సందడిగా గడుపుతుంటారు. బుధవారం 'ప్రపంచ పిక్నిక్ దినోత్సవం' సందర్భంగా జిల్లాలోని వివిధ స్పాట్లను చూసేద్దాం రండి.

యువత చొరవతో పిక్నిక్ స్పాట్ అభివృద్ధి

- దోకులపాడు తీరానికి పెరుగుతున్న సందర్శకులు

వజ్రపుకొత్తూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం తీర ప్రాంతంలో అనేక ప్రదేశాలు పిక్నిక్‌లకు అనువుగా ఉంటున్నాయి. వీటి అభివృద్ధిపై ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం లేదనే చెప్పాలి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు కొన్నిచోట్ల అభివృద్ధి పనులకు ముందుకొస్తున్నారు. దీనికి ఉదాహరణగా నిలుస్తున్నారు డోకులపాడు యువత. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి పిక్నిక్‌కు వస్తుంటారు. కానీ సౌకర్యాలు సరిగా లేవు. యువత చొరవతో ఒక్కొక్కటీ సమకూరుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీష డోకులపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సముద్ర తీరానికి సమీపంలో ఉన్న గంగాధరపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణానికి సహకరించారు. దీంతో యువత 'మన ఊరు- మనబడి ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ'గా ఏర్పడ్డారు. తీరంలో దాతల సహకారంతో బెంచీలు ఏర్పాటు చేశారు. ఎండలు, వర్షాలకు పర్యాటకులు ఇబ్బంది పడకుండా షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

తారురోడ్డుతో ఉపయోగం..

తారురోడ్డు నిర్మించడంతో డోకులపాడు తీరం పర్యాటకంగా అభివృద్ధికి మరింత ఊతమిచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే శిరీష రోడ్డును నిర్మించారు. దీంతో ద్విచక్ర వాహనాల ప్రయాణానికి అనుకూలంగా మారింది.
-రామకృష్ణ, మాజీ సర్పంచ్, డోకులపాడు

యువత సేవలు అభినందనీయం..



డోకులపాడు తీరం అభివృద్ధిలో యువత సేవలు అభినందనీయం. పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. డోకులపాడు పంచాయితీ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీరానికి వచ్చి ఆహ్లాదంగా గడుపుతున్నారు.
-పల్లేటి బాలు, డోకులపాడు


వజ్రపుకొత్తూరు: తీరం వరకు నిర్మించిన తారు రోడ్డు..


వజ్రపుకొత్తూరు: తీరంలో ఏర్పాటు చేసిన బెంచీ, షెడ్డు


తేలినీలాపురం విదేశీ పక్షులు

భలే భలే భావనపాడు

టెక్కలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో పిక్నిక్ సీజన్ వచ్చిందంటే చాలు... భావనపాడు సాగరతీరం ఉత్కళాంధ్రులతో కిటకిలాడుతుంది. ఆంధ్రా, ఒడిశాలకు భావనపాడు సాగరతీరం దగ్గరగా ఉండడంతో కుటుంబాలతో ఇక్కడికి వస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు వేల సంఖ్యలో తరలి వస్తుంటారు. సువిశాల సాగరతీరం.. సరుగుడు, జీడితోటలు... మత్స్యకారుల బోటపై విహారం వంటివి ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. ఇసుక దిబ్బలపై ఆడుతూ... పాడుతూ తీరంలో స్నానాలు చేస్తూ జనం సరదాగా గడుపుతుంటారు. అలాగే టెక్కలి మండలం తేలినీలాపురంలోనూ పిక్నిక్‌లకు వస్తుంటారు. సైబీరియా నుంచి వచ్చే విదేశీపక్షులు పెలికాన్, పెయింటెడ్ స్టార్‌ల విన్యాసాలు తిలకించేందుకు వాచ్‌టవర్... పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు ఉండడం... చెట్లు కింద సేదతీరేందుకు సౌకర్యం ఉండడంతో ఇటువైపు కూడా పిక్నిక్‌లకు వస్తుంటారు. టెక్కలి సమీపంలోరి జాతీయ రహదారి దరి జగతిమెట్ట కొండపై గల భైరాగి గుహలు, శివాలయం, తోటలు పిక్నిక్ స్పాట్‌లుగా ప్రసిద్ధిచెందాయి.


సోంపేట: బారువ బీచ్‌లో లైట్‌హౌస్

బారువ అందాలు చూడాల్సిందే..

- ఏటా భారీగా జనాల రాక

సోంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు పిక్నిక్ అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది బారువ బీచ్. పిక్నిక్‌ల సమయంలో ఈ బీచ్‌లో సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల నుంచి ఎక్కువగా సందర్శకులు వస్తుంటారు. ఎత్తయిన ఇసుక దిబ్బలు.. వీటికి ఆనుకొని కొబ్బరి తోటలు... మరోవైపు సముద్రం ఇదీ బారువ ప్రత్యేకత. లైట్‌హౌస్ నుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. పిక్నిక్‌లకు సముద్రం ఒడ్డున తోటలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. వీటికి తోడు రిసార్ట్‌లు కూడా పిక్నిక్‌లకు అనువుగా ఉండటంతో ఎక్కువ మంది ఇక్కడికి రావడానికి ఉత్సాహం చూపుతున్నారు.

ఎలా చేరుకోవాలంటే..

బారువ బీచ్‌కు చేరుకోవాలంటే సోంపేట నుంచి పలాస వైపు కానీ, పలాస నుంచి సోంపేట వైపు కానీ వెళ్లే పల్లెవెలుగు బస్సులు అందుబాటులో ఉంటాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులైతే బారువ జంక్షన్‌లో దిగి.. గ్రామానికి చేరుకోవాలి. బారువ గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరం వెళితే బీచ్‌కు చేరుకోవచ్చు.

సన్నాలు వద్దు.. ముదుగులే ముద్దు

(ఐదో పేజీ తరువాయి)

విత్తనాలు 20 కేజీల బస్తా గతేడాది రూ.వెయ్యి నుంచి రూ.1,200లోపు ఉండేది. ఈ ఏడాది అదేబస్తాను రూ.1400 నుంచి రూ.1800 వరకు విక్రయిస్తున్నారు. అమూల్య రకం విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి కొందరు డీలర్లు దోచుకుంటున్నారు.

● **నకిలీ విత్తనాలతో నష్టం..:** విత్తనాల ధరలు పెరిగి పోవడంతో నకిలీ విత్తనాల వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేయడానికి సిద్ధమవుతున్నారు. బ్రాండెడ్ ఖాళీ సంచులను సంపాదించి వాటిలో నాసిరకం ధాన్యాన్ని నింపి.. మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇదే మాదిరి నరసన్నపేటలో నకిలీ విత్తనాలు జోరుగా అమ్మకాలు సాగాయి. అప్పట్లో దీనివల్ల బాగా నష్టపోయిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మంచి విత్తనాలను అందుబాటు ధరకే అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రపంచానికే ఆదర్శంగా.. యోగా

(ఐదో పేజీ తరువాయి)

చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందిని 'యోగాంధ్రలో భాగం చేయడమే లక్ష్యం. విశాఖలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లాకు సంబంధించి 20వేల మంది పాల్గొంటారు. వారికి వసతితోపాటు రవాణా సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నాం. యోగాంధ్రలో పాల్గొనేవారికి సర్టిఫికెట్లు అందజేస్తాం. అదే రోజున జిల్లాలో 6,500 చోట్ల యోగా సాధనకు ఏర్పాట్లు చేస్తున్నామ'ని తెలిపారు. యోగాంధ్రలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావుతోపాటు పామర్రు, ఎర్రగొండపాలెం, పెడన ఎమ్మెల్యేలు కుమార్ రాజా, నారాయణరెడ్డి, కాగిత కృష్ణప్రసాద్, డీఆర్వో వేంకటేశ్వరరావు, ఏఎస్పీకె.వి.రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విశాఖకు 20 వేల మంది సాధకులు

- జిల్లా రెవెన్యూ అధికారి వేంకటేశ్వరరావు
- అరసవల్లిలో ఘనంగా యోగాంధ్ర

అరసవల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా నుంచి 20 వేల మంది సాధకులు వెళుతున్నారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు చెప్పారు. అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని కోరారు. మంగళవారం ఉదయం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆవరణలో 1000 మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత నీరజా సుబ్రహ్మణ్యం బృందంతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. తరువాత యోగా శిక్షకులు, వలంటీర్లు వెయ్యి మందితో ప్రాణాయామం, ధ్యానం, యోగా సాధన చేయించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న స్థానిక 80 అడుగుల రోడ్డులో గానీ, లేదా ఆర్ట్స్ కాలేజీ మైదానంలో గానీ 3000 మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, ఆదిత్యాలయ ఈవో ప్రసాదరావు, ఆయుష్ అధికారి డాక్టర్ పి.జగదీష్, డా.గౌతమ్, డ్వామా పీడీ సుధాకరరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకులు కొరారి రేణుక, తంగి స్వాతి, మురళి, దుంపల చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా అమ్మవార్లకు చల్లదనం



నందిగాం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నందిగాం ఉమాఅగస్త్యేశ్వర పొందర సంఘం నేతృత్వంలో అమ్మవార్లకు మంగళవారం చల్లదనం చేశారు. నీలమణిదుర్గ, సండెమ్మ, చింత పోలమ్మ, భూలోకమ్మ, సామాలమ్మ గ్రామ దేవతలకు మేళతాళాలు, గజముద్దలు, ముగ్రాటలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి చల్లదనం చేశారు. మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేకం అలంకరించి... పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలశాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

అల్లుడే కడతేర్చాడు

(ఐదో పేజీ తరువాయి)

మామ-అల్లుడు మధ్య గొడవలు జరుగుతున్నాయి. గంగయ్య గ్రామ పెద్దల వద్ద పంచాయతీ పెట్టేందుకు మంగళవారం ఉదయం సైకిల్‌పై వెళ్తున్నాడు. గ్రామ సచివాలయం సమీపంలో మాటుకాసిన అల్లుడు దశరథరెడ్డి మామ సైకిల్‌ను ఆపాడు. తన వద్ద ఉన్న కత్తితో మూడుసార్లు కడుపులో పొడవగా.. గంగయ్య కుప్పకూలిపోయాడు. వెంటనే నిందితుడు పరారయ్యాడు. స్థానికులు గంగయ్యను హుటాహుటిన ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో భార్య జానకమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు భోరున విలపించారు.

● గంగయ్య వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పెద్ద కుమార్తె డిల్లమ్మకు అదే గ్రామంలో దూరపు బంధువైన దశరథరెడ్డితో ఐదేళ్ల కిందట వివాహం చేశారు. జీవనరెడ్డి మద్యానికి బానిసై తరచూ గొడవపడి భార్యను వేధించేవాడు. ఈ దంపతులకు నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉంది. భర్త వేధింపులు భరించలేక.. పిల్లలతో కలిసి డిల్లమ్మ తల్లిదండ్రుల వద్దే ఆరు నెలల నుంచి ఉంటోంది. కాగా.. గతంలో బైక్ కావాలని దశరథరెడ్డి గొడవ చేసేవాడు. దీంతో డ్వాక్రా రుణం తీసుకుని.. ఫైనాన్స్ విధానంలో ఓ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి ఇచ్చారు. లోన్ సక్రమంగా కట్టకుండా, కుటుంబాన్ని పట్టించుకోకుండా దశరథరెడ్డి విచ్చలవిడిగా తిరుగుతుండడంతో మామా అల్లుడు, కుటుంబసభ్యుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల ఆ బైక్‌ను గంగయ్య తన ఇంటికి తీసుకెళ్లిపోవడంతో దశరథరెడ్డి మరింత కోపాన్ని పెంచుకున్నాడు. ఈ విషయమై మంగళవారం మళ్లీ గొడవ జరగ్గా.. పెద్దల వద్ద పంచాయితీ పెట్టేందుకు గంగయ్య సన్నద్ధమయ్యాడు. ఆ సమయంలో ఆయనను దశరథరెడ్డి హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడు కోసం గాలిస్తున్నామన్నారు.


గంగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

త్వరలో కొత్త మైనింగ్ పాలసీ

(ఐదో పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం చెక్ చెప్పింది. గనుల శాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. క్వారీల నిర్వహణకు అనుకూల పరిస్థితులు కల్పించింది. కన్సడరైజేషన్ పన్నులు ఎత్తివేయడం, లీజుల కాలపరిమితి 20 నుంచి 30ఏళ్లకు పెంచడం, క్వారీల డెడ్‌రెంట్లు సవరించింది. తాజాగా నూతన మైనింగ్ పాలసీని అమలు చేయనుంది. ఈ పాలసీలో సీనరీస్ చార్జీల పరిస్థితి, ఏ రకంగా ధరలు నిర్ణయిస్తారు, లీజులు కేటాయింపు అంశం, ఆన్‌లైన్ విధానాలు అంశాలపై పరిశ్రమల యాజమానులు ఎదురుచూస్తున్నారు.

పశుదాణాతో పాడిరైతుకు సాయం

- 50 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా

టెక్కలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు పశు దాణాను సరఫరా చేస్తూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వం పశుదాణా సరఫరా చేయలేదు. కూటమి ప్రభుత్వం మాత్రం పాడిరైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. పశుసంవర్ధక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కింజరాపు అచ్చెన్నాయుడు పాడి ఉత్పత్తిని వృద్ధిలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అమూల్ డెయిరీతో ఒప్పందాలు చేసుకోవడం వల్ల పాలకు సరైన ధర లేక పాడిరైతు నలిగిపోయాడు. ఇటీవల జిల్లాలోని బుడగట్లపాలెం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పశుదాణా పంపిణీని ప్రారంభించారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలోని రైతులు 4 లక్షల 56వేల ఆవులు, 40,477 గేదెలు పెంచుతున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. తెలుపు రేషన్ కార్డు కలిగిన పాడిరైతులకు 50శాతం రాయితీతో పశుదాణా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. పశుదాణా కిలో రూ.22.22 కాగా.. పాడిరైతు రూ.11.10 చెల్లించి పొందవచ్చు. ఇప్పటికే జిల్లాలో 250 మెట్రిక్ టన్నుల పశు దాణాను సిద్ధం చేశారు. ప్రతి మండలంలో పాడిరైతులకు పశుదాణా అందేలా పశుసంవర్ధకశాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వం పశుదాణా పంపిణీకి మంగళం పాడితే... కూటమి ప్రభుత్వం పాడిరైతులకు పశుదాణా అందించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వివిధ సంస్థలతో మాట్లాడి నాణ్యమైన దాణా సరఫరా చేయడంతో పాటు పాలవెల్లువ జిల్లాలో పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



పశుదాణా పంపిణీని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు (ఫైల్)

బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలిలో ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి పది మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఎంపికల్లో పది మంది తుది జట్టులో స్థానం సాధించారు. 60 కిలోల విభాగంలో అవినాష్ (పలాస), 75 కిలోల విభాగంలో కె.గౌరీశంకర్ (ఆమదాలవలస), 55 కిలోల విభాగంలో ఎస్.ప్రేమ్‌కుమార్, శివ (పలాస)తోపాటు మరో ఆరుగురిని ఎంపిక చేసినట్టు స్టార్ బాడీ బిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి.విజయ్‌కుమార్, ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.గౌరీశంకర్ తెలియజేశారు.

నేడు కవిటి మండల సమావేశం

కవిటి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు పరిపాలనాధికారి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని, అలాగే ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

లావేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బుడుమూరు విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ తామాడ ఇండస్ట్రియల్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనుండడంతో ఈనెల 19న గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఏఈ కె.అప్పన్న తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లావేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాతరౌతుపేట సమీపంలో గల జీడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై లావేరు పోలీసులు మంగళవారం దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ఐదు సెల్‌ఫోన్లు, రూ.4,665 స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ పి.జగన్మోహన్‌రావు తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాన జయరాం, ప్రతినిధులు మురళీధర్, చిట్టిబాబు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి

రణస్థలం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘ నాయకులు పున్నాన నరసింహులనాయుడు, వై.పాపినాయుడు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ.. పింఛన్‌దారుల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఫారం-16 కోసం పింఛన్‌దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తంబు ఇంప్రెషన్ కోసం ఎస్‌టీవో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని, మీసేవ కేంద్రాల్లో వేసుకోవచ్చన్నారు. విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణం కోసం స్థల సేకరణ, ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏలపై చర్చించారు. బాలిరామినాయుడు, ఎం.రామారావు, మన్నే కృష్ణా నందం, మీసాల వెంకటరమణ, బవిరి రమణ, వెంకటస్వామి, సీహెచ్ గోపాలరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

సరుబుజ్జిలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలతో మధ్యాహ్న భోజనం అందించాలని, ఈ విషయంలో ఎటువంటి రాజీపడవద్దని ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం గోనుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను సందరించారు. మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం, పరిసరాలు పరిశుభ్రత పరిశీలించారు.

మోడీతోనే సంక్షేమ పాలన



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షురాలు

గార, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతోనే సుపరిపాలన సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీ జనార్దన్ అన్నారు. మోదీ పదకొండేళ్ల సుపరిపాలనపై మంగళవారం కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లో పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మోదీ పాలనాలో చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జీవన విధానంగా యోగా మారాలి

జి.సిగడాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటా జీవన విధానం యోగా మారాలని హెచ్‌ఎం ఆర్‌ఎల్ కుమారి అన్నారు. మంగళవారం పాలఖండ్యాం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులచే యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, వైవీ రమణ, యు.ఆదిలక్ష్మి, వి.రాము, ఎం.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

వైసీపీ హయాంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని చిన్నాభిన్నం చేసేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం శ్రీకాకుళంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. 'బెంగళూరు నుంచి ఒకసారి రాష్ట్రానికి వచ్చి జగన్ షికారు చేసుకుని వెళ్తున్నాడు. పథకాల పేరుతో రాష్ట్ర ఖజానాను గత ప్రభుత్వం ఖాళీ చేసింది. ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. ఈ విషయంలో గత ప్రభుత్వం విఫలమైంది. అమ్మఒడి పథకం అని చెప్పి ఎంతమంది చిన్నారులుంటే అంతమందికీ ఇస్తామని అప్పుడు ప్రకటించి ఒక్కరికి మాత్రమే ఇచ్చారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన వ్యక్తి జగన్. గత ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారు. అక్రమ అరెస్టులతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు పెట్టారు. ఐదేళ్లు ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. పేదవాడికి అన్నం పెట్టడం ఇష్టం లేక అన్న క్యాంటీన్లు మూసి వేయించారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీచేస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా పూర్తి చేశాం. మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేశాం' అని స్పష్టం చేశారు.

ఆధారాలు లేని ఆరోపణలు సరికాదు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆధారాలు లేని.. ఆరోపణలు చేయడం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి సరికాదని.. జగన్ మాయమాటలకు ప్రజలు లొంగిపోరని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఓట్లతో జగన్‌కు బుద్ధి చెప్పినా.. ఏమాత్రం మార్పురాకపోవడం బాధాకరమన్నారు. ప్రతితల్లి సంతోషంగా ఉండేందుకు 'తల్లికి వందనం' అమలుచేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని.. ఈ విషయంలో మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి ఉందన్నారు. ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు ఈ పథకం వర్తింపజేస్తే.. ఎటువంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మహిళా నాయకులు కె.సుశీల, నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి

విశాఖలో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో నియోజకవర్గ ప్రజలు పాల్గొనేలా చూడాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. ఈ మేరకు నియోజకవర్గం టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జీలతో యోగాపై సమీక్ష నిర్వహించారు. ప్రధాని మోదీ పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమీక్షలో కృష్ణా జిల్లా టీడీపీ నాయకులు వర్ల కుమార్‌రాజా, శ్రీనివాసులుతోపాటు స్థానిక నాయకులు మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగా డేని విజయవంతం చేయాలి

● పెడన, మార్కాపురం ఎమ్మెల్యేలు



సమీక్షలో పాల్గొన్న పెడన, మార్కాపురం ఎమ్మెల్యేలు

ఆమదాలవలస, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పెడన, మార్కాపురం ఎమ్మెల్యేలు కాగితాపు కృష్ణప్రసాద్, కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న యోగా డే ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకులుగా ప్రభుత్వం వారిని నియమించింది. దీంతో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌తో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ఆసక్తి కనబరిచారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని సుజాత, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే సరైన అవకాశాలు

ఎచ్చెర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతోనే అవకాశాలను అందిపుచ్చుకోగలమని హెచ్‌పీసీఎల్ రిటైర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కెమికల్) ఎస్.సూర్యనారాయణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన ఫ్యాకల్టీ ఇంట్రాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నైపుణ్యం, సమయపాలన తదితర అంశాలు పురోగతికి ఉపయోగపడుతాయన్నారు. వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ యోగా, ధ్యానం, శారీరక, మానసిక ఆరోగ్యం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.









మోదీతోనే దేశంలో సుపరిపాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 11ఏళ్లలో భారతదేశ దశ, దిశ వైభవాన్ని విశ్వవేదికపై నిలబెట్టిన ఘనత ప్రధాని మోదీదే అన్నారు. పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా 11ఏళ్ల ప్రయాణం విజయవంతంగా సాగిందన్నారు. ముందుగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వజ్జపర్తి రఘురాం, బూరాడ వెంకటరమణ, కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, సీనియర్ నాయకుడు పైడి వేణుగోపాలరావు, సంపతిరావు నాగేశ్వరరావు, గొర్లె లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలి

లావేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయకపోవడం అన్యాయమని, కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం దారుణమని పలువురు ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదపాక, గుమడాం, పాతకుంకాం ఎంపీటీసీలు గంట్యాడ సత్యం, జగురోతు తవిటినాయుడు, జనపాల భానోజీరావు, గుర్రాలపాలెం సర్పంచ్ షేక్ షాందీభాషాలతో పాటు మరి కొంతమంది సభ్యులు అధికారులను నిలదీశారు. రెడ్‌జోన్ నుంచి గుర్రాలపాలెంను తొలగించి వ్యవసాయ బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఎంపీటీసీ భానోజీరావు రెవెన్యూ అధికారులను కోరారు. లావేరు సర్వేయర్ అధికార పార్టీనాయకులకే పనులు చేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. గోవిందపురం సర్పంచ్ పిల్ల రాము, గుర్రాలపాలెం సర్పంచ్ షేక్ షాందీభాషలు అధికారులను నిలదీశారు. పీఆర్ ఏఈ శ్రీవల్లి, ఐసీడీఎస్ సీడీపీవో రూపాలత, ఆర్ఐ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రమేష్, ఏపీవో ఆర్.సత్యవతి, వెలుగు ఏపీఎం సుబ్బయ్యనాయుడు, ఏవో మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ సమావేశానికి సభ్యులు కాని వారు కొంతమంది హాజరై అధికారులను విసిగెత్తించారు. మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, ఎంపీడీవో పి.వెంకటరాజు పాల్గొన్నారు.

పీఎండీఎస్‌తో మరింత భూసారం



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

ఎచ్చెర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా భూమి పచ్చగా ఉండేలా ప్రీ మాన్ షోన్ డ్రైసోయింగ్స్ (పీఎండీఎస్)ను ప్రోత్సహిస్తున్నామని, దీనివల్ల భూసారం మరింత పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. ఎస్‌ఎం పురంపేట, ఎచ్చెర్ల గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. భూమిని ఖాళీగా విడిచిపెట్టడం వల్ల సాగులో పలు ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. దీనిని నివారించేందుకే పీఎండీఎస్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. పీఎండీఎస్, ఏటీఎం మోడల్స్, ఖరీఫ్-2025 వార్షిక ప్రణాళికను అధికారులకు వివరించారు. వీహెచ్ఏ కె.రేవతి, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సబ్‌ట్రెజరీ అధికారి బి.కృష్ణారావును ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. మంగళవారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన్ని పెన్షనర్లంతా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కె.షన్ముఖరావు, బొడ్డేపల్లి జోగారావు, బెండి సూర్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆమదాలవలస, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చెరకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. మంగళవారం కొరపాం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సత్తిరాజు, వ్యవసాయ విస్తరణాధికారి టి.రాము, వ్యవసాయ సహాయకుడు ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ఇచ్ఛాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని మండల విద్యాశాఖ అధికారి కె.అప్పారావు అన్నారు. మంగళవారం పంజావీధిలో గల మునిసిపల్ పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లును ఎంఈవో చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



యోగా నిరంతరం కొనసాగించాలి

కవిటి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాభ్యాసాన్ని విద్యార్థులు నిరంతరం కొనసాగించాలని మండల విద్యాశాఖాధికారి ధనుంజయ మజ్జి కోరారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులచే యోగాసానాలు వేయించారు. ఈ నెల 21న విశాఖలో పండగ వాతావరణంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

← యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు





ఉత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

వైభవంగా భద్రాంబిక ఉత్సవం

గార, జూన్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం గ్రామ దేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో వేలాది మంది మహిళలు ఘటాలతో, మేళతాళాలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారరు. అక్కడ చల్లదనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవం ప్రశాతంగా జరిగేలా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కంచమ్మతల్లికి పూజలు

కంచిలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కంచమ్మతల్లి సంబరాల మారువారం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణలో ఉన్న పూజారిని పసుపు నీళ్లతో అభిషేకాలు చేపడుతూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు →



చింతామణి అమ్మవారి సంబరం



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కవిటి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కవిటి చింతామణి అమ్మవారికి మంగళవారం సంబర మహోత్సవాన్ని నిర్వహించారు. బొరివంక గ్రామానికి చెందిన భక్తులు గజముద్దలు, కాళికావేషధారణలతో కవిటిలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి..

ఇచ్ఛాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలను పట్టణ పరిధిలోని పలు వీధుల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



షట్టర్లు ఇలా.. సాగునీరెలా?

● మరమ్మతులకు నోచుకోని వైనం ● శివారు ప్రాంతాలకు అందని నీరు ● ఇబ్బందులు పడుతున్న రైతులు



జోగులపేట వద్ద లుకలాం ఓపెన్ హెడ్ చానల్‌పై పాడైన షట్టర్లు

జలుమూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువ కింద రైతులకు సాగునీరందక తీవ్ర ఇబ్బం దులు ఎదు ర్కొంటున్నారు. ప్రధాన కాలువ ఏర్పాటు చేసి దశాబ్దాలు గడి చింది. నాడు ఏర్పాటు చేసిన షట్టర్లు పూర్తిగా పాడయ్యాయి. దీంతో నీరు లేక రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. సీజ న్ ప్రారంభానికి ముందే వేసవిలో కాలు వలు అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఆ దిశలో ఎక్కడా చర్యలు తీసు కోకపోవడంతో కాలువలు రూపాన్నే కోల్పోతు న్నాయి. షట్టర్లు పాడవ డంతో నీరు విడుదల చేసినా కాలువల్లో నిలువ ఉండడం లేదు. దీంతో ఎప్పటిలానే రైతులు సాగునీటి కోసం పరితపించాల్సిన పరిస్థితు లు ఎదురవుతున్నాయి. కాలువల అభివృద్ధి, షట్టర్ల మరమ్మతులపై ఏటా ప్రజా ప్రతినిధులు హామీలిస్తున్నా అవి ఆచరణలోకి రావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మండలం పరిధిలోని కరకవలస నుంచి రాణా కూడలి వరకు వంశధార ప్రధాన ఎడ మ కాలువపై అప్పట్లో ఏర్పాటు చేసిన షట్టర్లు పూర్తిగా శిథిలావ స్థకు చేరుకున్నాయి. దీంతో పిల్ల కాలువలకు సాగు నీరందక రై తులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 40 పంచాయతీల కు గాను 30 పంచాయతీలకు చెందిన గ్రామాలకు వంశధార ప్ర ధాన ఎడమ కాలువ నీరే ఆధా రం. కాలువలపై ఉన్న షట్టర్లు మరమ్మతులకు నోచుకోక పోవ డంతో సాగునీటి కోసం ఆకాశం వైపు చకోరాల్లా ఎదురు చూడా ల్సిన పరిస్థితి. వంశధార ప్రధాన ఎడమ కాలువ నుంచి 19ఆర్ పిల్ల కాలువకు వెళ్లే సాగునీటిని విడుదల చేసేందుకు బుడితి వద్ద షట్టర్లు నిర్మించారు. అలాగే 24 ఎన్‌బీసీ కాలువకు సాగునీరు వెళ్లేందుకు పెద్దదూగాం వద్ద షట్టర్లు ఏర్పాటు చేశారు. అలాగే 18 ఆర్ తిమడాం చానల్‌కు, న గిరికటకం ఓపెన్ హెడ్ చానల్‌కు సాగునీరు వెళ్లేందుకు పధాన ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్లు పాడవడంతో సకాలం లో సాగునీరం దడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది కూడా శివారు భూములకు సాగునీరందడం ప్రశ్నార్థ కంగా మారింది. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఈ సీజన్‌లో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. దీనిపై వంశధార ఏఈ జె.అప్పలరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ ఏడాది ఉపాధి హామీలో పనులకు ప్రతిపాదనలు చేశామని, అయితే అందులో అవకాశం లేదన్నారు. ఆపరే షన్ అండ్ మెయింటినెన్స్‌లో భాగంగా మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వరూపం కోల్పోయిన దుర్గగెడ్డ



నర్సింగపల్లి సమీపంలో దుర్గగెడ్డ దుస్థితి

టెక్కలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లి, మొఖలింగాపురం పంచాయతీల పరిధి, నంది గాం మండలం రాంపురం పంచాయతీ రైతులకు సాగునీరందించే దుర్గగెడ్డ పూడికలు, చెట్లతో నిండిపోయి స్వరూపం మారిపోయింది. దీనిని చూస్తే ఇది కాలువేనా అన్న అనుమానాలు కలగక మానవు. పూడికలతో శివారు ప్రాం తాలకు సాగునీరందడం లేదని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో దుర్గగెడ్డపై ఒక్క రూపాయి కూడా వెచ్చించక పోవడంతో కాలువ చెట్లు, పొదలతో నిండిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి గెడ్డను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి ఉసురు తీసింది

● విద్యుదాఘాతంతో భవన నిర్మాణ సెంటరింగ్ కార్మికుడి మృతి
● నందిగాంలో విషాదం
● లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు



మృతిచెందిన శంకరరావు

నందిగాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దేవళభద్ర పంచాయతీ జల్లపల్లిలో విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ సెంటరింగ్ కార్మికుడు శంకరరావు (42) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నందిగాంకు చెందిన శంకరరావు భవన నిర్మాణ సెంటరింగ్ మేస్త్రీ అగురు బాలకృష్ణతో కలిసి మంగళవారం జల్లపల్లిలోని గొనప కారయ్య ఇంటి నిర్మాణ సెంటరింగ్ పనికి వెళ్లారు. కట్ చేసిన ఇనుక గజాలను మేడపైకి తీసుకు వెళ్తుండగా ఇంటి ముందు నుంచి వెళ్తున్న 11కేవీ హై టెన్షన్ వైరు తగలడంతో శంకరరావు అక్కడే కుప్ప కూలి పోయాడు. బాలకృష్ణ సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్న శంకరరావు మృతిచెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడినట్లయింది. ఉపాధే ఊపిరి తీసిందని వారు లబోదిబోమంటున్నారు. పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య గౌరి, కుమారులు నవీన్, జశ్వంత్, ఇతర బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మిన్నంటింది. శంకరరావు అందరితో కలివిడిగా ఉంటూ వ్యవసాయ పనులు, ఇతర పనుల్లోనూ అందరికీ చేదోడుగా ఉండేవాడని, అటువంటి వ్యక్తి ఇక లేడన్న సంగతి తెలుసుకుని పలువురు ఆవేదనకు గురయ్యా రు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం హెచ్‌సీ వీవీ రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తర లించారు. ప్రమాదం విషయాన్ని వీఆర్వో సురేష్, కార్యదర్శి ఉమాపతి అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఉప తహసీల్దార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు.

పలాసపురంలో దొంగతనం



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ

సోంపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పలాసపురం గ్రామంలో సోమవారం రాత్రి సినీఫక్కీలో జరిగిన దొంగతనం కలకలం రేపింది. గ్రామానికి చెందిన బెందాళం అశోక్ ఇంట్లో జరిగిన ఈ చోరీలో రెండు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదు పోయినట్టు ఎస్ఐ లవ రాజు తెలిపారు. భార్య, భర్తలు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రపోయారు. అయితే ఎప్పటిలాగే ఉదయం చూసే సరికి దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీ ఫక్కీలో..

ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా గోడపై ఉన్న వెంటిలేటర్ల నుంచి ఇంట్లోకి దూరి దొంగతనానికి పాల్పడ్డారు. అయితే ఈ దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తే ఇంటిని పూర్తిగా పరిశీలించిన తర్వాత దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంటి స్లాబ్ హుక్కుకు తాడుకట్టిన తర్వాత నిచ్చెన వేసినా వెంటిలేటర్ అందకపోవడంతో కుర్చీపై వలను పెట్టి ఇనుప రాడ్డుతో దానిని తొలగించి లోపలికి వెళ్లినట్టు తెలుస్తోంది.

ఇరువర్గాల కొట్లాట

● 12మందికి గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఇచ్ఛాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామంలో చిన్న పిల్లల గొడవ పెద్దల కొట్లాటకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈదుపురం గ్రామంలో పిల్లలు వారం కిందట జల్దీ ఫైవ్ ఆడుకుంటూ గొడవపడ్డారు. ఈ గొడవ పెద్దలు వరకు వెళ్లింది. ఆ తర్వాత పెద్దలు సర్దిచెప్పడంతో అంతా వెళ్లిపోయారు. ఈ విషయమై మంగళవారం అంబటి శంకర్, మద్దిల జగన్నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాలు కర్రలతో కొట్టుకున్నారు. దీంతో అంబటి శంకర్‌తో పాటు మద్దిల జగన్నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం బరంపురం మెడికల్‌కు తరలించారు. ఇరువర్గాలకు చెందిన మరో 10 మందికి తలలపై, శరీరంపై గాయాలయ్యాయి. వీరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనువాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగుహక్కు పత్రాలు కలిగి ఉండాలి

నందిగాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కౌలురైతులు సాగుహక్కు పత్రాలు కలిగి ఉండాలని వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మంగళవారం దిమిలాడలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయని, వినియోగించుకోవాలని కోరారు.

'తల్లికి వందనం'పై వైసీపీ తప్పుడు ప్రచారం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేసిందని, అయితే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది తగదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పథకంపై వైసీపీ దిగజారుడు ఆరో పణలు చేస్తోందని, తల్లికి గౌరవం ఇవ్వలేని మాజీ సీఎం నేడు ఈ కార్యక్రమంపై అవా స్తవాలు పేర్కొనడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో ఇంటిలో ఒకరికి మాత్రమే రూ.13 వేలు ఇచ్చారని, మిగిలిన రూ.2 వేలు అప్ప టి సీఎం జగన్ ఖాతాలోకి వెళ్లిపోయాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో కేవలం 42 వేల మందికి అమ్మఒడి పడితే తల్లికి వందనం కింద 67.27 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో తల్లుల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయని, దీనిని చూసి ఓర్వలేక ఆ పార్టీ మూకలు తప్పుడు ప్రచారా లు మొదలె ట్టారని విమర్శించారు. అనాథలైన పిల్లలకు కూడా కలెక్టర్లు నిర్ధారించిన తరువాత పథకం అమలు చేస్తామని, పారదర్శకత కోసం సంబంధిత సచివాలయాల్లో లిస్టులను ప్రదర్శనకు పెట్ట డం జరుగుతుందన్నారు.

వైసీపీ నేతలు జీర్ణించుకోలేకున్నారు

● పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తల్లికి వందనం పథకం అమలు విజయవంతం కావడంతో వైసీపీ నేతలు జీర్ణించుకోలేకున్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన ఈ పథకం ద్వారా ఒకేరోజు పదివేల కోట్లకు పైగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడం రికార్డు అని అన్నారు. ఎన్ని కలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల ను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఎంతమంది చదువుకుంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పేరిట డబ్బులు జమచేసి పిల్లల చదువుకు ఆసరాగా నిలిచారన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం ఆల్‌ఆంధ్రా రోడ్డు మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

జలుమూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరిక సంఖ్యను పెంచాలని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. జలుమూరు ప్రాథమిక, చల్లవానిపేట ఉన్నత శాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైనందను ఎక్కువ మంది విద్యార్థులు వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఇప్పటి నుండే ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో పిల్లలకు నాణ్యమైన, శుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. చల్లవానిపేట పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నతపాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం

నరసన్నపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ఉషాఛాయా పద్మిని సహిత సూర్యనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహిం చారు. ఆలయ ధర్మకర్త లు శిమ్మ అచ్యుతరామ్ దంపతులతో రుత్వికులు వనమాలి కృష్ణశర్మ విశేష పూజలు, కల్యాణం చేయించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న రుత్వికులు

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయికి నివాళి

పాతపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయి 167వ వర్ధంతిని ప్రిన్సిపాల్ పట్ట పద్మావతి ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి విగ్రహానికి రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు తదితరులు నూలుపోగుల దండను వేసి నివాళి అర్పించారు. ఆమె చేసిన పోరాటాన్ని వివరించారు. అనంతరం విద్యార్థు లకు ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్రపై వక్తృత్వ పోటీ నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.భార్గవి, అధ్యాపకులు కె.నాగమణి, బి.ప్రమీల, ఐ.శశివర్ధం తదితరులు పాల్గొన్నారు.

వంశధార సాగునీటి కోసం ఐక్యం కావాలి



దబారులో ర్యాలీ చేస్తున్న రైతులు

హరిపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వంశధార సాగునీరు ఇచ్ఛాపురం వరకు తరలించేందుకు రైతులంతా ఏకమవ్వాలని సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మథరావు అన్నారు. డబారు, బిన్న ల, వీవీఆర్‌పురం గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశమై ర్యాలీలు నిర్వహించారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే వంశధారను ఇచ్ఛాపురం వరకు పొడి గించాలని, దీనికి ఎమ్మెల్యే శిరీష సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వి.మాధవ రావు, హేమా రావు చౌదరి, నల్ల హడ్డీ, గుంట చక్రపాణి, సోమనాథం పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావద్దు: ఏఎస్ఐ

నరసన్నపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, దీనివల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు కుటుంబం ఇబ్బందులు పడుతుందని ఏఎస్ఐ తులసినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలకు ఈగల్ టీం అండగా ఉంటుందని, టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. యోగాతో మానసిన, శారీరక ఆరోగ్యం పెంపొందించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.లత, అధ్యాపకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ డీడీగా డాక్టర్ చంద్రశేఖర్



డాక్టర్ చంద్రశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

టెక్కలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ పి.చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పూర్తి అదనపు బాధ్యతలతో పలాస నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన డాక్టర్ జయరాజ్ పాడేరు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌కు డాక్టర్ శిరీష, గోవింద్, రూప, రామచంద్రరావు, సంతోష్ పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు.

ఖరీఫ్ పనులు ముమ్మరం



విత్తనాలు జల్లుతున్న రైతు

జలుమూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ పనులను రైతులు ముమ్మరం చేశారు. ఈ ఏడాది మేలోనే వర్షాలు పడడంతో వేసవి దుక్కిలు చేసి పొలాలు సిద్ధం చేశారు. పొలాల గట్లు వేసి వరి ఎదలు వెదజల్లేందుకు సిద్ధపడ్డారు. ఈనెల 7న మృగశిర కార్తె రావడం మోస్తరు వర్షాలు పడుతుండడంతో వరి విత్తనాలు వేసుకునేందుకు పదును కుదరడంతో ఎదలు జల్లుతున్నారు. ఈనెల 21న ఆరుద్ర కార్తె వస్తుండడంతో అంతకు ముందుగానే వరి విత్తనాలు వెదజల్లుతున్నారు. వర్షాధార ప్రాంతాలైన జోనంకి, సుబ్రమణ్యపురం, వెంకటాపురం, చల్లవానిపేట, దరివాడ, లింగాలవలస, టెక్కలిపాడు, ఏనేటికొత్తూరు, రావిపాడు తదితర గ్రామాల రైతులు వరి ఎదలు వేస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేసే పద్ధతికి స్వస్తి చెప్పి ఎదల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

చేపల వ్యాన్ బోల్తా



నరసన్నపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుండువిల్లిపేట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చేపల వ్యాన్ బోల్తాపడింది. శ్రీకాకుళం వైపు నుంచి నరసన్నపేట వస్తున్న చేపల వ్యాన్ ఒక్కసారి డ్రైవర్ బ్రేక్ వేయడం, చిరుజల్లులతో రోడ్డు తడిచి ఉండడంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అదే సమయంలో అటుగా ఎటువంటి వాహనాలు రాక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో క్లీనర్ కృష్ణకు గాయాలయ్యాయి. హైవే సిబ్బంది ఘటన ప్రాంతానికి చేరుకుని వ్యాన్‌ను పక్కకు తీసి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ జి.ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విద్యుత్‌లైన్ ఏర్పాటులో భాగంగా చంగుడి, సరాళి గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

పోలాకి మండలంలో..

పోలాకి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈదులవలస 11 కేవీ ఫీడర్ పరిధిలో వ్యవసాయసంబంధిత విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, పోలాకి ఏఈ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గొల్లలవలస, తోటాడ, సంతలక్ష్మీపురం, కొండలక్ష్మీవలస, కింజరాపువానిపేట తది తర గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టెక్కలి నుంచి బుడితి ఫీడర్ పరిధిలోనూ..

టెక్కలి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి 33కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టెక్కలి నుంచి బుడితి ఫీడర్, దీనికి అనుసరించి ఉన్న చల్లపేట, సారవకోట, బుడితి సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్ కో ఈఈ జి.శంకరరావు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్లకు ఆల్టర్నేట్ ఫీడర్ సప్లై ద్వారా విద్యుత్ సరఫరా ఇవ్వబడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించా లని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

నరసన్నపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా ప్రతిరోజు లీప్ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు సూచించారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. యూడైస్ యాప్‌లో ఒకటో తరగతి విద్యార్థుల అడ్మిషన్ల వివరాలను ఈనెల 25 తేదీలోగా నమోదు చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు సకాలంలో విద్యా కిట్లను పంపిణీ చేయాలన్నారు. ఈనెల 21 ప్రపంచ యోగా దినోత్సవ్వాన నిర్వహించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మధ్యాహ్న భోజనం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నరసన్నపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలగవీధిలో గుజ్జల శేఖర్ ఇంట్లో ఈనెల 12న జరిగిన చోరీ ఘటనకు సంబంధించి సుందరాపురం గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గారావు తెలిపారు. ఈ చోరీలో శేఖర్ ఇంటిలో నిందితుడు చొరబడి పుస్తెలతాడు, చెవి దిద్దులు దొంగిలించాడు. మంగళ వారం సత్యవరం జంక్షన్ వద్ద తనిఖీ సమయంలో పారిపోతుండగా పట్టుకొని ప్రశ్నించగా చోరీ వ్యవహారం బయటపడిందన్నారు. చోరీకి గురైన పుస్తెలతాడు, చెవి దిద్దులను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

కార్యాలయం బోర్డేదీ?

● ఎప్పుడు తెరుస్తారో తెలియదు
● ఇదీ మెట్టూరు రైతుసేవా కేంద్రం తీరు



మెట్టూరులో బోర్డులేని రైతు సేవా కేంద్రం

కొత్తూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మెట్టూరు పంచాయతీ సచివాలయ రైతుసేవా కేంద్ర భవనంపై అసలు పేరు రాయలేదు. ఇది ఏ కార్యాలయమో తెలియక పలువురు తికమకపడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కేంద్రాన్ని ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూస్తారో సిబ్బందికే ఎరుక. రైతులకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు వస్తేనే కేంద్రాన్ని తెరుస్తున్నారని, మిగిలిన సమయాల్లో తెరవడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని కాలాల్లో రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వచ్చినా మూసి వేసి ఉంటోందని దీంతో తరచూ ఇక్కట్లకు గురికావా ల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. సచివాలయా నికి దూరంగా ఈ భవనం ఉండడం వల్ల విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఒక్కరే ఇక్కడ విధులు నిర్వహించలేక మూసివేసి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రంలో రైతులకు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరు తున్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శి ఆరిక శంకరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రైతు సేవా కేంద్రం బోర్డు లేదని గుర్తించామని, విత్తనాలు, ఇతర సామగ్రి ఈ కేంద్రంలో ఉంచారన్నారు. అగ్రికల్చర్ సహాయకులు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారని, రైతు సేవా కేంద్రంలో సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.